నరసురాజు & కంపెనీ వారి
వీర సామ్రాజ్యం
మాటలు - పాటలు:
మల్లాది రామకృష్ణ శాస్త్రి
సంగీతం:
పామర్తి
డైరెక్టర్:
యోగానంద్

వంతపాటలు

వినరా ఆంధ్రుడ చోళ పల్లవుల - వీరగాధ నేడు
వీరయోధులారా స్వాతంత్ర్య - ప్రియులారా వినుడు

★

వీరసామ్రాజ్యం

1961

(బుర్రకథ)

★

శ్రీ శ్రీ శ్రీ నరసింహవర్మయ - క్షీణబాహుబలుడు
ఆశ్రిత పోషకు - డరిజనభీకరు - డాహవ పండితుడు
చేర చోళ పాండ్యులను గెల్చితా - పోరాటమునందు
వీరాగ్రణి పల్లవ రాజ్యంబును - విస్తరింపజేసె
రెండవ పులికేసిని వధించి తన - తండ్రిపగను దీర్చి
ఖండన భీముడు, 'మహామల్లుడను' - ప్రఖ్యాతిని బడసె

విదూషకుడు : ప్రఖ్యాతా ? ఏవిట్రా ఆ ప్రఖ్యాతి ?

విమర్శకుడు : నరసింహవర్మ చేర, చోళ, పాండ్య రాజులను జయించి తన రాజ్యాన్ని అభివృద్ధి పరిచాడు. ఒకప్పుడు తన తండ్రిని చంపిన రెండవ పులకేసిని యుద్ధభూమిలోవధించి మహామల్లుడను బిరుదు బడశాడు.

విదూషకుడు : అఁ.... ఈ బిరుదులకేం వచ్చెలేరా, ఆయనకు మహా మల్లుడను బిరుదుంటే - దాని తాత బిరుదు మనకీ ఉంది.

విమ : ఏవిట్రా అది ?

విదూ : 'పిల్లిభీముడు' మన పేరుచెపితే హడల్, చచ్చిన కాకులు నీళ్లు తాగవు.

విమ : అంతట నోరు మూయరా! ఆయన నీ మాదిరిగా కాకుల్ని కొట్టే దద్దమ్మ కాదురా. భీకర శాత్రవులను జయించిన మహాయోధుడు. పల్లవ రాజ్యానికి ప్రభువు. ఆ రాజ్యానికి ముఖ్యపట్టణం కంచి. నరసింహవర్మ క్రీ. శ. 630 మొదలు 668 వ సంవత్సరంవరకు పల్లవరాజ్యాన్ని పరిపాలించాడు. దాని సరిహద్దున చోళరాజ్య ముంది. దీని ముఖ్య పట్టణం ఉదయగిరి.

చోళరాజ్యమును పార్థివుండు పరి - పాలించుచునుండె
చాల పరాక్రమశాలి పార్థివుడు - స్వాతంత్ర్య ప్రియుడు.
అన్నపూర్ణ పార్థివుని సతీమణి - ఆదర్శ గృహిణి
అన్నిట భర్తకు తగిన పత్ని య - త్యున్నతమగు బుద్ధి
విక్రముండు యేకైక పుత్రుడా - వీర దంపతులకు
చక్రధరుని కృపవల్ల గలిగెనా - చక్కని పుత్రుండు

విదూ : ఆయన కేమిటి మనకీ వున్నాడొక పుత్రరత్నం.

విమ : అట్లాగా! బుద్ధిమంతుడేనా?

విదూ : అనుమానమా! మా జంగాల పాలెంలో నేను ముట్టిస్తే మూడు కొంపలు తగలడినై. వాడు పుట్టిన్నాడు మూటికి మూడు ఆరు వందల గడప అమాంతంగా కాలి పోయింది. (కథకునివైపు చూచి) కానివ్వరా కథ.

కథకుడు : పార్థివుడు సామంతరాజు. స్వాతంత్ర్య ప్రియుడు. బానిస బ్రతుకు ఈయనకు నచ్చలేదు. అందువలన చక్రవర్తియైన నరసింహ వర్మకు కప్పం కట్టడం మానివేశాడు.

నరసింహ వర్మ పనుపున దూత వచ్చి కప్పం కట్టమని పార్థివునికి నచ్చ చెప్పాడు. కాని ఆయన వినక యుద్ధానికే సిద్ధమయ్యాడు. ఆయన సరాసరి తన భార్య అన్నపూర్ణవద్దకు వెళ్ళి ఆమెతో అంటాడూ:-

అతివా! నేనిదె-యాహవ భూమికి తందాన తందాన తందన
అరిమూకలచెం - డాడ వెడలితిని ,, ,, ,,

వీరుల కెప్పుడు - దారులు రెండే .. .. ..
విజయమొ, లేదా - వీరస్వర్గమో .. .. ..
కావున తెల్పెద వినుమిటు వెరవక - కాంతామణి నీవు
పూజ్యులైన మా పూర్వులు బట్టిన తందానా తందాన తందన
వీరఖడ్గమిది - విజయఖడ్గమూ .. .. ..
రెండవ వస్తువు - దండి గ్రంథము .. .. ..
ఈరెంటిని నీ - కిచ్చుచునుంటిని .. .. ..
వీరయోధునిగ పెంచి విక్రముని - వీటి నతనికిమ్ము

విదూ : వీరఖడ్గమా ?

విమ : అవును.

విదూ : బీరకాయలు తెగుతుందా ?

విమ : ఛా ఛా నోరుముయ్యరా.

విదూ : లేకపోతే ఏవిటా ? ఆయనకంటే నేనే మెరుగు. నా కొడుక్కి ఒకటోనెంబరు కత్తెరకొని ఇచ్చాను. మహారాజై యుండి తుప్పు పట్టిన తాతలనాటి పాతకత్తీ, పురుగులుతిన్న పుస్తకమునా కొడుక్కి ఇచ్చేది.

విమ : అదా నీ సందేహం. ఆ కత్తి ప్రస్తుతం వన్నెతరిగి వున్నమాట నిజమే. అది కరికాళ చోళులూ, వారి పూర్వులూ ధరించిన ఖడ్గం. వారంతా సర్వ స్వతంత్రులై ఈఖడ్గాన్ని ధరించి చోళమండలాన్ని పరిపాలించారు. కాని ఈనాడు పార్థివుడు సామంతరాజు. అందువలన ఆయన ఆ ఆయుధాన్ని ధరించలేదు. ఆ గ్రంథాన్ని ముట్టుకోలేదు. నేడు ఈ రెంటినీ తన కుమారునికి యిస్తున్నాడంటే దానికొక అర్థంవుంది. మనవాడు చెప్తాడు విను :

కథ : అన్నపూర్ణా ! మన విక్రముడు ఎంత చిన్నరాజ్యానికైనాసరె స్వతంత్ర ప్రభువైనపుడే ఈ ఖడ్గాన్ని ధరించడానికీ, ఈ గ్రంథాన్ని పఠించడానికీ అర్హుడవుతాడు. అప్పుడే వీటిని విక్రమున కివ్వు అని చెప్పాడు. ఆమె దాని కంగీకరించింది. కన్నీరు తుడుచుకొని తన భర్తకు వీరతిలకం దిద్ది యుద్ధరంగానికి పంపించింది.

చోళుల సర్వసైన్యాధిపతి యైన మారప్ప భూపతి పార్థివుని తమ్ముడు. స్వార్థి, ప్రాణభీతిచే సైన్యాధిపత్యానికి తిలాంజలి వదలిన పిరికిపంద.

పున్నడు పార్థివుడికి నమ్మినబంటు. అందువల్ల పార్థివుడు అతన్ని తన కుమారునికి రక్షకుడుగా నియోగించాడు. తరువాత తానే సర్వసైన్యాధిపత్యం వహించి సేనను రణరంగానికి నడిపాడు. యుద్ధం ప్రారంభమైంది – ఎట్లా :

రణభేరి గర్జించింది
బ్రహ్మాండం ఘూర్ణిల్లింది
కత్తులు కత్తులు కలిశాయి
నెత్తురు టేరులు పారాయి.
మెరసెను పార్థివు కరవాలం
బెదరెను పల్లవ విభు సైన్యం
పుర్రెలు పుర్రెలు యెగిరాయి
పుడమికి మొండాల్ దొర్లాయి

వ॥ కాని పల్లవ రాజ సైన్యం ఎంత పెద్దదో పార్థివుని సైన్యం అంత చిన్నది. అయినాసరే:–

హోరా హోరిగ పోరి పోరి రణ – ధీరుడు పార్థివుడు
ధారుణి కొరిగెను మాతృదేశమును – తలచుకొనుచు తుదకు
ముగిసెను యుద్ధము – యుద్ధభూమిలో – మిగిలెను పీనుగులు
వగచుచు శవాల మధ్యగ అచటికి – వచ్చెను శివయోగి

వ॥ వచ్చి అచ్చట కొన ఊపిరితో పడియున్న మహా యోధుడౌ పార్థివుని చూచి తన కమండలంలోని నీళ్ళన్ని తీసి ఆయన ముఖాన చిలకరించాడు. పార్థివుడు మెల్లగా కన్నులు తెరచి యెదుటనున్న శివయోగిని చూచి–

పార్థివుడు : ఎవ్వరు మీరు స్వామీ ?

శివయోగి : అంబరనాధ మహాభక్తుల దాసోవ దాసుడను.

పార్థి : ఈ యుద్ధభూమికి తమరెందుకు వచ్చారు ?

శివ : ఎందుకంటావా ?

అన్నా నీదు యపూర్వధైర్య సాహసములను గురించి
విన్నానయ్యా మహాయోధుడా - వీనులలర నేను
కన్నులార నినుజూడదలంచితి - గాంచితి ధన్యుడను
ఇన్నిటికీ యేదైన కోర్కె నీకున్న దెల్పుమయ్యా

పార్థి : నా కోరిక చెప్పాలా స్వామీ ?

శివ : అవును.

పార్థి : తీరుస్తారా ?

శివ : శక్తివంచన లేకుండ ప్రయత్నిస్తాను.

పార్థి : అయితే వినండి.

సంపూర్ణ స్వాతంత్ర్యముతో నొక - జానెడు ధరనైన
ఇంపుగ పరిపాలించవలయునని - ఎన్నో కలలుగంటి
కలలు కల్లలై మట్టిలోననే - కలిసిపోవుచుంటి
కలకలగా మిగలక నా పుత్రుని - కాలములోనైన
మా కోరిక నెరవేరి తీరవలె - మాన్యపురుష కనుక
మాకులవర్ధను తీర్చి దిద్దుడన - మాన విక్రమునిగ
అని తన కోరిక దెలిపి పార్థివుం - డస్తమించినాడు
అనఘుడు శివయోగీంద్రుడు కన్నుల - నశ్రులు నింపాడు.

విదూ : ఒకనాడు కుర్రవాళ్ళం నలుగురం పోగై వూరుబయట చెట్టుక్రింద ఆడుకుంటున్నాం. అక్కడకు ఇట్లాగే కమండలం గిమండలం పట్టుకొని ఒక పెద్దమనిషి దయచేశాడు. వచ్చీరావడంతోనే చెట్టుక్రింద బిళ్ళబీటుగా విరుచుకు పడ్డాడు. అంతా ఆయన దగ్గరకు పరుగెత్తిచూచాం. స్వరాజ్యం, స్వరాజ్యం అని కలవరిస్తున్నాడు. చచ్చేముందుగూడ స్వరాజ్యాన్ని కలవరించే ఈయనెంత దేశభక్తుడో అనుకున్నాం. ఊళ్ళోకి తీసుకువెళ్ళి సకల శుశ్రూషలు చేసి బ్రతికించాం. బలిపించాం కూడ. మొదట స్వరాజ్యం స్వరాజ్యం అనేమనిషి బలిసినతరువాత నా స్వరాజ్యం నాస్వరాజ్యం అనడం సాగించాడు. ఆ అదేమిటి స్వామీ స్వరాజ్యం అందరి జన్మహక్కు గదా అన్నా నేను. ఆ మాటలు వినడంతోనే

స్వాములవారు భగ్గునమండి దిగ్గున లేచి నా స్వరాజ్యంమీద నీ కేమిటి హక్కు. అది నా భార్యపేరు, కనుక నేనా పేరు జపిస్తున్నాను. మధ్య మీరెవ్వరు? అన్నాడు. సరే స్వామీ! మీరా జపం మానుకోకపోయినా మీ జపం మేం మానుకున్నాం. దయచేయండి అన్నాం. అట్లాంటి యోగి కాదుకదా! యీ శివయోగి?

విమ : కాదురా ఈయన అట్లాంటి వాడుకాదు. విశాల హృదయుడైన పల్లవ చక్రవర్తి నరసింహవర్మ. ఈయన, శివయోగి వేషంలో పార్థివుణ్ణి చూడడానికి వచ్చాడు.

విదూ : అట్లాగా ఈ మధ్య ఈయనకు పిచ్చి ఎక్కలేదుగదా?

విమ : అదేమిట్రా!

విదూ : పగవాడింట్లో పది పీనుగులు వెళ్ళినా చాలని సంతోషించక ఇట్లా వచ్చాడెందుకు?

విమ : ఆయన నీలాంటి నీచుడు కాదు. వీరయోధుడు. కనుకనే తనకు శత్రువు తన సేనలని చీల్చి చెండాడిన మహాయోధుడగు పార్థివుణ్ణి చూడడానికి వచ్చాడు. ఆయన కోర్కె ఏమిటో తెలిసుకున్నాడు. ఆ స్వాతంత్ర్యాభిలాషి కళేబరం మీద నాలుగు కన్నీటి బొట్లు విడిచాడు.

విదూ : తెలియక ఏదో వాగాను. (చంపలు వేసుకొంటూ కథకునితో) కానివ్వరా బాబు.

కథకుడు : ఇక్కడ పరిస్థితి ఇట్లావుంది. ఇకనక్కడ అన్నపూర్ణ తన భర్త చనిపోయిన వార్తవిని-

అన్నపూర్ణ మూర్ఛిల్లి తెప్పరిలి – ఆ నాథా యనుచు
కన్నీరది కాలువలై పారగ – కనలి యేడ్వసాగె
సామంతులుగా బ్రతుకుట కంటెను – చావే మేలనుచు
స్వామీ మము విడనాడి పోతిరా – స్వర్గమునకు మీరు
వీరునిగా విక్రముని జేసి తమ – కోరిక నెరవేర్చి
చేరుకొనియదను స్వర్గంబును మీ – సేవలు చేయుటకు
వ॥ ఇట్లు విలపించు చున్న సమయములో-

ఇక్కడ కప్పుడు శివయోగేంద్రుడు - గ్రక్కున చనుదెంచి
అక్కడ జరిగిన కథయంతయు నా - యమ్మకు వినిపించి
వీర యోధునిగ చేసెద నిదెసీ - విక్రమునని పలికి
వీర పత్ని ఆ తల్లి అనుమతిని - విక్రము తోడుకొని
వెడలి పొయె శివయోగి రయంబున - విడచి యా స్థలంబు
కడు వేదనతో చూచుచు నిలచెను - కొడుకునన్నపూర్ణ

వ॥ నరసింహవర్మ విక్రమునొక ప్రత్యేక స్థలంలో ఉంచాడు. శివయోగి రూపంలో వస్తూపోతూ అతనికి సకల విద్యలు గరుపుతున్నాడు. నరసింహవర్మ ముద్దుల కూతురు కుందవి విక్రమునికన్నా చిన్నది.

కుందవి విధాత చేసిన చక్కని - కుందనంపు బొమ్మ
చందమామ నెకసెక్కములాడెడి - అందమైన మోము
మల్లెమొగలను కూర్చిన మాలిక - బాలిక పలువరస
పల్లవ భూపతికి నోచిన నోముల - పంట చిట్టిపాప
కిలకిల నవ్విన మంచి ముత్యములు - జలజల జలరాలు
జిలి బిలి పలుకుల సోయగమింతని - చెప్ప తరముగాదు.

భళా భళానోయ్ తమ్ముడా - సై - భాయి భళానోయ్ దాదానా

అంతఃపురమున కుందవి సై
అక్షరంబులను దిద్దుచు సై
అత్యంతానందంబుగ సై
ఆటల నాడుచు పాడుచు సై
పెరిగి పెద్దదైపోతోంది
మురిపాలను కురిపిస్తోంది. ॥భళా భళా॥
పార్థివు కోరిక తీరగ సై
ప్రత్యేకంబగు స్థలమున సై
శివయోగులు నిరతంబును సై
శిక్షణ నిచ్చుచు నుండగ
సకల విద్యలా విక్రముడూ
చక చక నేర్చేస్తున్నాడు ॥భళా భళా॥

వయస్సు వచ్చిన కుందవి　　పై
వస్తూవున్నది చూడర　　పై
ప్రకృతి అందాన్నంతయు　　పై
బ్రహ్మ కుప్పగాచేసి యీ　　పై
కుంద-నే సృష్టించాడు
అందమంటె ఇదె అన్నాడు　　॥భళాభళా॥
విక్రముడు డడుగో చూడర　　పై
విచ్చుకత్తి ధరియించెర　　పై
మేటిధీరుడై నిలచెర　　పై
మెచ్చదగిన రూపంబుర　　పై
నూనూగుమీసం వచ్చింది
నూటికి సెలగంటున్నాడు　　॥భళాభళా॥

వ॥ ఈ విధంగా శివయోగి శిక్షణలో విక్రముడు అన్ని విద్యలలో ఆరితేరాడు.

విదూ : అదేలే, నా కింద మా వాడు తయారైనట్లు.

విమ : నోరుమూసుకోరా విక్రముడికీ మీ వాడికీ పోలిక :

విదూ : మా వాడండే ఏవిఁటనుకున్నావ్ ? ఆకాయ్ జూకాయ్ అల్లాటప్పాగాడనుకున్నావా ? వాడి పేరు ఎక్కడ చూఁనా మోత. మోత. ఆ మోతకి మొన్న కొమ్ములుతిరిగిన మొనగాళ్ళు పిల్లనిస్తామంటూ వచ్చారు.

విమ : ఇతకూ సంబంధం కుదిరిందా ?

విదూ : కుదిరినట్లే కుదిరి చిటికలో చిట్లిపోయింది.

విమ : అట్లాగా ?

విదూ : అస లేం జరిగిందంటే - పిల్లవాడి చూపుల కొచ్చిన పెద్దలు ___

విమ : ఏమండీ మీ వాడి గుణగణాలు....

విదూ : గుణగణాలకేమండీ ? వంకపెట్టే పనిలేదు, కాకపోతే అప్పుడప్పుడు కాస్త సిగిరెట్టు తగలేస్తాడు.

కథ : దాని కేవిఁటిలే.

విదూ : ఆ సిగిరెట్టయినా కారాకిల్లీ వేస్తేనే.

విమ : కారాకిల్లీయే !

విదూ : అదికూడ అన్నప్పుడూ వెయ్యడు, కాసిని పుచ్చుకున్నప్పుడు తప్ప.

కథ : తాగుతాడా ?

విదూ : ఎప్పుడూ ఎందుకు తాగుతాడండి. చీట్లపేకలో డబ్బులొస్తేనే.

విమ : పేకాటకూడానా, సరి సరి.

విమ : ఆచీట్లపేకైనా జేబులు కొట్టడం సక్సెస్ అయినప్పుడే.

కథ : ఏమన్నారు ?

విదూ : ఆ పనైనా అన్నప్పుడూ చేస్తాడనా. జైల్లోనుంచి బయటకు రాగానే జేబులో డబ్బులుండవుగా ? అదుగో అట్లాంటప్పుడే.

విమ : జైల్లోకూడ పడ్డాడూ ?

విదూ : ప్రతి చిన్నపనికి జైలుకు వెళతాడా ! అబ్బెబ్బే ఏదో చిన్న ఖూనీ చేసినప్పుడు మాత్రమే.

కథ : అయ్యా మీ సంబంధానికి మీకు మీవాడికి ఒక దండం. మేం పోతాం.

విదూ : పొండి, మీ కర్మ. దానికి నేనేం జేస్తాను.

విమ : విక్రముడు నీ కొడుకులాంటివాడు కాదు. అతనికి శిక్షణ యిచ్చిన శివయోగీ నీ లాంటివాడు కాదు. కావున విక్రముడు ఎంత సమర్థుడో ముందు ముందు నీకే తెలుస్తుంది. జాగ్రత్తగ విను.

కథ : అప్పుడు శివయోగి విక్రముణ్ణి పిలచి, విక్రమా ! నేను మీ నాన్న కిచ్చిన మాట నిలబెట్టుకున్నాను. ఇక మిగతా పని నీది. వెళ్ళి రమ్మని విక్రముణ్ణి ఇంటికి పంపించాడు.

ఒకనాడు విక్రముడు తన తల్లితో అంటాడూ ! అమ్మా.

పల్లవరాజులు మన శిలాముఖీ - పర్వతాగ్రమందు
త్రుళ్ళుచు గట్టిన సింహపతాకము - త్రుటిలో తొలగించి
నెలకొల్పెద మన చోళ ప్రభుత్వపు - పులిజండా నేడె
సెలవిమ్మని తన తల్లికి మ్రొక్కి - నిలచెను ధీరుండు.

వ॥ ఇంతలో అక్కడికి శివయోగి వచ్చాడు. విక్రము డాయనను చూచి -

విక్రమ : స్వామీ ! శిలాముఖీపర్వతంమీద సింహపతాకం ఎగురుతోంది. దానిని దించి ఆ స్థానంలో పులిజండా కట్టేవరకూ నాకు శాంతి లేదు.

శివయోగి : సరేగాని నాయనా, అక్కడ పల్లవసేనలు కాపున్నాయి. నీవా వంటరివాడవు.

విక్రమ : కాదు మా చిన్నాన్న 'మారప్ప భూపతి' సైన్యాలను సమీకరించాడు.

శివ : నిజమేనా అన్నపూర్ణాదేవీ ?

అన్నపూర్ణ : అవును స్వామీ ! ఆయనలో ఇప్పుడు చాలా మార్పు కనుపించుతూవుంది.

శివ : అయితే సరే (విక్రమునితో) జాగ్రత్త సుమా ! ఏది ఏమైనా నీవు నీ పట్టుదలను విడువవద్దు, వెళ్ళిరా !

కథ : అని శివయోగి విక్రముని దీవించి వెళ్ళిపోయాడు.

ఇకనక్కడ నరసింహవర్మ తన కుమార్తెను తీసుకొని మహాబలిపురం వెళ్ళాడు. అక్కడ తమ పూర్వులు చెక్కించిన శిల్పాలను తన కుమార్తెకు చూపించుతున్నాడు. ఆ శిల్పాల్లో ఒక్కొక్కటి ఒక కళాఖండం. అవి మహాబలిపురానికి దక్షిణంగా.

కడలి ఒడ్డున గట్లు గుట్టలున్నై ॥తందాన తాన॥
గుట్టలపైగల గొప్ప శిల్పములను ,,
రమ్యమైన పౌరాణిక గాథలను ,,
కుందవి కన్నులవిందుగ చూస్తోంది ,,
పూతనజంపు యపూర్వగాథ మొదలు ,,
బాలకృష్ణునీ లీలలన్ని గలవు ,,
గంగానది నా ఘనుడు భగీరథుడు ,,
పుడమికి తెచ్చిన పుణ్యగాథలున్నై ,,
అనేక శిల్పాలా గుట్టల నట్లు ,,
మనోహరంగా మలచివైచినారు ,,

వ॥ ఈ యద్భుత దృశ్యాలన్నిటిని కుందవి చూచి తన్మయురాలవుతున్నది. ఇంతలో అశ్వారోహకు డొక డక్కడకు వచ్చి నరసింహ

వర్మకు నమస్కరించాడు. శిలామూర్తిపైకి దాడి వచ్చిన విక్రముని బంధించారన్న వార్త తెలియజేశాడు.

కుందవి : ఒక్కడే ఎట్లా దాడికి వచ్చాడు నాన్నా ?

నరసింహవర్మ : అతని పినతండ్రి మారప్ప సైన్యాలను సమీకరించాడులే.

భటుడు : లేదు ప్రభూ ! ఆయన మన సేనాపతితో మంతనాలాడుతున్నాడు.

కుంద : ఇల్లాంటి తిరుగుబాటుదార్లను వదిలిపెట్టకూడదు. గట్టిగా శిక్షించు నాన్నా.

విదూ : ఏమిత్రా ఈ విక్రము డేదో గొప్పవాడనుకుంటే, పోయి లటుక్కున పట్టుబడ్డాడు ?

విమ : సైన్యాలను సమీకరిస్తానన్న పినతండ్రి ద్రోహంచేశాడు. పాపం ఒక్కడే ఆ మహాసైన్యంతో ఎందాక పోరాడగలడు ?

విమ : అటువంటి సమయంలో తప్పుకోవటం చేతకానివాడు, అసలు యుద్ధానికి ఎందుకు వెళ్ళాలంట ? నే నయితేనా ....

విమ : ఏంచేసేవాడివి?

విదూ : ఏంచేసేవాణ్ణా ? ఒకప్పుడు నాకు నా పొరుగువాడికి చేను సరిహద్దు గట్టుదగ్గర తగాదా వచ్చింది. వాడు గుంటుపిక్కలాంటి మనిషి. ఏంచేద్దామా అని ఆలోచిస్తున్నా, ఇంతలో మావాళ్ళు నలుగురు పోగై నువ్విటునుంచి రారా, మేం అటునుంచి వస్తాం. వా డెక్కడికి పోతాడు, నలిపిపారేద్దాం అన్నారు. సై అంటే సై అన్నా.

మరునాడు బాణాకఱ్ఱ భుజానపెట్టి బయలుదేరా. తీరా చేను దగ్గరకుపోయి చూద్దునుగదా !....... ఎక్కడ పురుగునాకిపోయారో - మావాడు ఒక్కడూ కనబడలా. వాడు నన్ను చూడనే చూశాడు. చూచి వూరుకున్నాడా ! పులి దూకులు దూకుతూ నామీదకు రానేవస్తున్నాడు. వెంటనే నేనేమి చేశానో తెలుసా ? ధన్‌మని ప్లేటు మార్చా. వచ్చేవాడితో బావా ! బావా ! బాగుండావా అన్నా, మా వాళ్ళంతా నీ మీదకు దాడికి బయలుదేరితే, వాళ్ళను నాలుగు చివాట్లు వేసి, ఆ సంగతి నీతో చెపుదామని

ఇట్లా వచ్చాను అన్నా. వా డేం చేశాడో తెలుసా! పకపకా నవ్వి ఓరి పోరా చవటా అన్నాడు. పెద్దవాడవు నువ్వు అనవచ్చు. నేను పడావచ్చు. శాంతమే భోషాణం అంటూ చల్లగా జారుకున్నాను.

విమ : (నవ్వి) వాడు చవటా అన్నాడేకాని, నేనైతే చవటన్నర అనే వాడిని.

విదూ : ఇప్పుడు కాదురా! సమయం చూచి మంచినిద్రలో ఉండగా, వాడి తల పదహారు ముక్కలుగా నేను పగలగొట్టకపోతే - అప్పుడను.

విమ : నీవు చవటవే గాదు, నీచుడవు కూడా! ఆ విక్రముడు నీలాంటి పిరికిపంద కాదురా! ధీరులకూ, దేశభక్తులకూ ప్రాణం గడ్డిపరకతో సమానం. తెలుసా! నోరు మూసుకొని కథ విను.

కథ : తరువాత నరసింహవర్మ భటునకు ఏదోచెప్పి పంపివైచాడు. కుమార్తెతోసహా తమకొరకు సిద్ధంగావున్న వాహనంమీద కంచికి తరలి వెళ్ళాడు. మరునాటి ఉదయం కుందవి పల్లకిలో దేవాలయానికి వెళ్తూవుంది. సరిగ్గా అదే సమయానికి—

గొలుసులు పెట్టీ-బలముగ గట్టీ ॥తందానా తందానా తందన॥
రాజ భటులు ఆ - రాజ మార్గమున ,, ,,
గైకొనివచ్చిరి - ఘనుని విక్రముని ,, ,,
శూరుని ధీరుని - వీరయోధుని
పల్లవ రాజకుమారి చూచి తన మది నిట్లని తలచె
ఈతని సోయగ - మేమనవచ్చును తందానా తందానా తందన
మనుజుండై ఇ - మ్మహి కరుదెంచిన ,, ,,
కంతుడ లేక వసంతుడ ఈతడు ,, ,,
భర్తగ నీతని బడయుభాగ్యమూ ,, ,,
ఏ సుదతీమణి కబ్బునో ఆయమ - యెంత పుణ్యవతియొ!
అని తలపోయుచు తన దెసచూచెడి - ఆ రమణీ మణిని
కనుగొని విక్రము డట్లే నిలచెను కనులు కనులు గలసె

కథ : ఈ విధంగా కుందవి, విక్రములు కలుసుకున్నారు. అంతేకాదు, పరస్పరం ప్రేమించుకున్నారు కూడా.

విదూ : అయ్యిందీ ప్రేమించుకున్నారూ! సరె లవ్ ఈజ్ లాంగ్, లైప్ ఈజ్ షార్ట్ అన్నారు.

కథ : ఈ దృశ్యాన్నంతా కుందవి చెలికత్తె చూస్తూనే వుంది. ఆమె రాజకుమార్తెను మందలించి, మందిరానికి తీసుకువెళ్ళింది. భటులు విక్రముని జైలులో బంధించారు. అత డా రాత్రి కుందవికి కలలో కనుపించాడు. ఆమె త్రుళ్లిపడి లేచి తన చెలికత్తెతో చెలీ ;

కీర్తన: కలలో నా కలలో
కలలో కనుపించాదే
చెలియా రమ్మనీ పిలిచాడే ॥కలలో॥
మైమరపించిన ఆ రాజు
నా-మనసు హరించిన వలరాజు
నవ్వుచు పువ్వులు కోశాడే
నా-జడలో తానే తురిమాడే ॥కలలో॥
కావేరీనది తీరాన
కమ్మని ఆ వెన్నెలలోన
చల్లగ నాదరి జేరాడే
మెల్లగ కౌగిట జేర్చాడే ॥కలలో॥

వ॥ ఆ రాత్రి కుందవికి నిద్రలేదు. కన్ను మూసినా తెరచినా విక్రముడే ఆమెకు కనుపించుతున్నాడు. మరునాటి ఉదయం విక్రముని విచారణ. అతనిని రాజసభకు తీసుకువచ్చారు.

రాజు : విక్రమా! నీవు దోషివి, అంగీకరిస్తావా ?

విక్ర : ఎవరు, దోషులు ? శిలాముఖీపర్వతం మాది.

రాజు : అది యుద్ధానికి పూర్వంమాట. ఇప్పటికయినా మించిపోలేదు. కప్పం కట్టి నీ రాజ్యాన్ని నీ వేలుకో

పాట : అట్టి మాటలు విన్న విక్రము
డాగ్రహమ్మున చూచి రాజును
ప్రళయగర్జన చేసి పలికాడు
వీరాధి వీరుడు
బానిసగ నే బ్రతకనన్నాడు॥

వాసి గలిన ప్రభువువై తే
తీసి ఈ బేడీలు నాపై
తారసిలి పోరాడమన్నాడు
వీరాధివీరుడు
విజయ మెవరిదో తేలునన్నాడు ॥

వ॥ తుదకు నరసింహవర్మ విక్రమునికి ద్వీపాంతరవాసశిక్ష విధించాడు. తిరిగి ఈ దేశంలో కాలుపెట్టావా - మరణ శిక్ష తప్పదు అన్నాడు. వెంటనే మహాబలిపురంలో నావ ఎక్కించి అతన్ని చంపక దీవికి పంపించారు.

ఈ వార్త తెలిసి అన్నపూర్ణ విపరీతంగా బాధపడుతూఉంది. ఆమెకు పున్నడిభార్య వల్లి, సకలోపచారాలు చేస్తోంది. ఇంతలో శివ యోగి, పున్నడు కలసి అక్కడకు వచ్చారు.

అన్నపూర్ణ శివయోగిని చూచి :

సామీ ! విక్రము దేడి చూపు డీ - సారికి మ్రొక్కెదను
ఈ మహిలో శివయోగులుండ మా - కేమి ప్రమాదమని
భావించితినని రాళ్ళుకరుగ నా - పరమసాధ్వి ఏడ్వ
బావురుమని ఆ తల్లి కాళ్ళపై - పడెను పున్నడల్లె
కని యీ దృశ్యము యోగిగుండెలే - కదలి చెదరిపోయె
పెనవేసెడి దుఃఖము నత డెట్లో - యణచివేసి పలికె

వ॥ విచారించకు అన్నపూర్ణా ? నీ కుమారుడు సామాన్యుడుకాడు. నిండుసభలో నరసింహవర్మను ధిక్కరించి దండచరిచాడు. ఆ దృశ్యాన్ని చూస్తే నీ వింతగా విలపించవు. చంపకదీవి నుంచి వచ్చి అతడు నిన్ను తప్పక కలుసుకుంటాడు. నా మాట నమ్ము. అని అనేక విధాల నచ్చ చెప్పి, శివయోగి ఆమె నోదార్చాడు. తరువాత ఆయన పున్నణ్ణి, వల్లిని పిలచి, రాణిని వేయికళ్ళతో కాపాడమని చెప్పాడు. ఇంకా అనేక యితర విషయాలుకూడ మాట్లాడి వెళ్ళాడు.

అప్పటికి నావికులు విక్రముని చంపకదీవికి చేర్చారు. దానికి రాజు లేదు. ఎక్కడ చూచినా అరాజకం తాండవమాడుతూఉంది. ప్రజ

లంతా కలసి ఒక ఏనుగుకు పూలదండ యిచ్చి దానిని విడచిపెట్టారు. అది ఆ దండను తెచ్చి విక్రముడి మెడలో వేసింది. తమ నిర్ణయం ప్రకారం ప్రజలతన్ని ఆ దీవికి రాజుగా ఎన్నుకున్నారు.
విదూ : జాడించి తంతే బూరెలబుట్టలో పడ్డాడన్నమాట.

విక్రము డచ్చట తమ పులిజండాను ॥తందాన॥
వినువీధికి తా - నెగురవేసినాడూ ,,
మేలుభళీయని మెచ్చగ జనులంత ,,
మేటిధీరు డా చంపకద్వీపమున ,,
బహునేర్పుగ పరిపాలన సాగించి ,,
పాడిపంటలకు నిలయం చేశాడు
దందణ భాయి దేవనందనాన ,,
అయినా అతనికి మనశ్శాంతి లేదు ,,
అన్నపూర్ణ కలలోనికి వస్తూంది ,,
అమ్మా యంటూ దిగ్గున లేస్తాడు ,,
అందచందముల కుందవి దేవెపుడు ,,
అతని హృదిలో మెదలుతుఉంటుంది ,,
తుదకు నావపై బయలుదేరినాడు ॥దంధణ॥

వ॥బయలుదేరి మహాబలిపురం చేరుకున్నాడు. సమయాని కక్కడ ఉత్సవాలు జరుగుతున్నై. ఆ ఉత్సవాలకు కుందవికూడ వచ్చింది. విక్రము డొక రత్నాలవ్యాపారివేషం ధరించి, దేవసేనుడను పేరుతో తిరుగుతున్నాడు. మరుగుజ్జువాడు ఒకడు రత్నాల మూటనెత్తుకొని ఆయన వెనుక నడుస్తున్నాడు. ఆ మరుగుజ్జువాడు మూగవాడు. ఒకనాడు—

దేవాలయమున కేగుచు కుందవి - దేవసేనుగాంచి
సేవకు నొక్కని బంపి అతని తన - చెంతకు పిలిపించి
ఎవ్వరు మీరని యడగిన విక్రము - డిట్లనె వినయముగ
జవ్వని నే రతనాలవర్తకుడ - చాల ప్రయాసపడి
తెచ్చినాను రతనాలను చూడం - డిచ్చెద మీ కనిన
ఇచ్చట గాదని కుందవి అతనికి - నచ్చజెప్పి పలికె.

వ॥ ఇక్కడకాదు. సాయంత్రం రాజభవనానికి రా. రాకుమార్తె కుందవి తప్పకుండ నీ రతనాలను కొంటుంది.

విమ : అయితే మీ రెవరు ?

విదూ : ఆమె చెలికత్తెను.

కథ : ఇంతలో అక్కడకు మారప్పభూపతి వచ్చి విక్రమునితో-

విదూ : ఎవ్వరు నీవు ?

విమ : రతనాలవ్యాపారిని.

విదూ : నీ పేరు ?

విమ : దేవసేనుడు.

విదూ : ఎక్కడనుంచి రాక ?

విమ : చంపకదీవినుంచి.

విదూ : మీ రాజెవరు ?

విమ : శ్రీశ్రీ విక్రమ చోళ మహారాజు.

విదూ : (నవ్వి) ఓహో, పాపం అతనికి తన తల్లికిపట్టిన దుర్గతి తెలియదునుకుంటాను.

కథ : ఇంతలో నరసింహవర్మ ఏనుగుమీద అటువచ్చాడు. ఆయన్ని చూచి ఎటువారటు తప్పుకున్నారు.

వ॥ తన తల్లి కేదో ఆపద సంభవించివుంటుందని విక్రముడు తలచాడు. వెంటనే ఆమెను కలుసుకోవటానికి బయలుదేరాడు.

భళా భళానోయ్ తమ్ముడా - సై - భాయి భళానోయ్ దాదాన

కాలినడక నా ధీరుడు సై
చాలవేగమున పోవుచు సై
పల్లెలు పల్లెలు గడచెను సై
పంటపొలాలను నడచెను సై
చెట్లూ గుట్టలూ దాటాడు
చిట్టడవులలో పడ్డాడు ॥భళాభళా॥
చిరుచీకటి వ్యాపించెను సై
చిట్టడవులనే దాటెను ,,
ఘోరాటవిలో జొచ్చెను ,,

కారుచీకటులు గ్రమ్మెను ||సై||
మరుగుజ్జ డుగో చూడరా
మార్గం చూపిస్తున్నాడు ||భళాభళా||
భీకరమగు నొక శబ్దము సై
సోకెను విక్రము చెవులకు ,,
చెవిటివాడు మరుగుజ్జుర ,,
చెవులు నిక్కబొడిచాడుర ,,
బిరాన విక్రము డావేళా
కరవాలంబును దూశాడు ||భళా భళా||

వ॥ ఇంతలో రివ్వున మరుగుజ్జు ఒక బండపైకెక్కి వికారంగా అరచాడు. ఆ యరపుతో విచ్చుకత్తులు ధరించిన పలువురు హంతకులా విక్రమునిమీద దూకారు.

దూకిదూకుటతోడనే పట్టిరి - ధూర్తులు విక్రముని
వీక దలిర్పగ నీచుల నాతడు - విసరికొట్టి ధరకు
పరమ కిరాతకులారా మీ కిక - మరణము తప్పదని
వరుసగ తలలను కరంబులను తెగ - నరకసాగినాడు
పదుగురు భయంకరాకారులతో - కదనంబును సలిపి
తుద కా ధీరుండు డలసిపోయె నా - యదనున నొక ఘనుడు
వారువంబుపై వచ్చి తోడ్పడెను - వీరవిక్రమునకు
ఆ రణరంగ ప్రవీణుల ధాటికి - అగలేక కలులు
పారిపోయి రెటువా రటు కుక్కల - పగిది యడవిబట్టి
ధీరుల ముందర నిలువ రెప్పుడు - క్రూరు లెందరైన

వ॥ విక్రముడు తనకు తోడ్పడిన అవ్యక్తినిచూచి

కథ : అయ్యా మీ రెవ్వరు ?

విమ : నన్ను వీరసేను డంటారు.

కథ : సమయానికి వచ్చి నన్ను రక్షించారు.

విమ : నేను రక్షించినదేముంది! ఇంతమంది నీచులను వధించిన నీకు మిగిలిన ఒక రిద్దరిని చంపడం ఒక లెక్కా! సరె, తొందరగా బయలుదేరు. మన మిక్కడ ఉండడం ప్రమాదం.

కథ : అని పల్కి వీరసేనుడు తన గుర్రం కళ్ళెం పట్టుకొని ముందుకు సాగాడు. విక్రము డాయన్ని అనుసరించాడు.

ఆ కీకారణ్యంలో 'శిల్పిగృహం' ఒకటివుంది. మన వీర యోధు లిద్దరక్కడకు చేరుకున్నారు. ఆ గృహంలోవుండే ఒక ముసలమ్మ పండ్లు, ఫలహారాలు తెచ్చి వారి ముందుంచింది. యిద్దరూ హాయిగా భుజించారు.

తరువాత దేవసేనుడు వీర సేనునితో-

విమ : వీరసేనా ! మీ ప్రభువు నరసింహవర్మ గొప్ప పరాక్రమశాలి అని విన్నాను. ఆయన రాజ్యంలో కూడ బందిపోటు దొంగలా ?

కథకు : నీ మీద దాడిచేసినవారు బందిపోటు దొంగలనుకున్నావా ?

విమ : కాక మరెవరు ?

కథకు : అదంతా ఒక పెద్దగాథ. వింటావా ?

విమ : తప్పకుండా.

కథ : చెప్పెద విను నర - సింహవర్మతా   తంధానా తంధాన తందన
దాడిచేసి వాతాపి నగరమున   ,,   ,,   ,,
ఖలుని కిరాతుని - కఠిన హృదయునీ   ,,   ,,   ,,
పులికేసిని రణ - భూమి వధించెను   ,,   ,,   ,,
ఆ యుద్ధంబున నీలకేశికుడి - హస్తము తెగిపోయె॥
నీలకేశి కడు నీచుడు ధూర్తుడు   తంధాన తంధాన తందన
మోసగాడు పుల - కేసికి తమ్ముడు   ,,   ,,   ,,
చేరివాడు ఈ - కారడవులలో   ,,   ,,   ,,
దారుణ కృత్యాల్ - క్రూరుడు చేయుచు   ,,   ,,   ,,
కపాల భైరవుడను నామంబున - గ్రాలుచు నున్నాడు
కాపాలికు లీ ఘాతకు శిష్యులు   తంధాన తంధాన తందన
మా ప్రజలకు పెడ మార్గము చూపీ   ,,   ,,   ,,
భైరవికిట నర-బలుల నొసంగుచు   ,,   ,,   ,,
ప్రభుత్వంబునే పడ గూల్చుటకై   ,,   ,,   ,,
బహు ప్రయాసపడుచున్నాడీతని -
పట్టవలెను మేము   ,,   ,,   ,,

వీ॥ నిన్ను పట్టి బంధించి భైరవికి బలి ఇవ్వాలని వాళ్ళతలంపు. ఈ ప్రాంతంలో ఏ కొండబిలంలోనో వారి నివాసమై వుంటుంది. ఆ జాడ తీయటానికే నేనీ అరణ్యంలో తిరుగుతున్నాను. అని వీరసేనుడు చెప్పాడు. ఇంతలో తెల్లవారింది. దేవసేనుడు ఉదయగిరికి బయలు దేరాడు. వీరసేనుడతనికి తన గుఱ్ఱాన్నిచ్చి పంపించాడు. అతడు వెళ్ళిన తరువాత వేరొకగుఱ్ఱంమీద తానెక్కడికో వెళ్ళిపోయాడు. ఈ వీరసేనుడు మారువేషంలోవున్న నరసింహవర్మ—

విక్రముని గుఱ్ఱానికి ఉదయగిరి మార్గం తెలుసు. అది వాయువేగాన పోతూవుంది.

విదూ : పోతుందిలే, అతనికి తొందరంతా తల్లిని కలుసుకోవాలనేగా. ఆమె ఏదో ఆపదలో వుందని అక్కడ మారప్పగాడు చెప్పాడుగా. అది ఎంతవరకు నిజమంటావు ?

విమ : నిజమే.

విదూ : అట్లాగంటే ఎట్లా ? ఆమె గతి ఏమైందో కాస్త చెప్పరా !

కథ : అయితే విను.

పతి రణరంగంబున మరణించెను - సుతుడటైపోయె వెతలు మిగిలె
తుద కా తల్లికి యిక - మతి మతిలో లేదు.
కంటి నీరు కడవలకు నింపి తనగతికి చింతపడుచు
ఒంటరిగా నాభవనంబున పడి - యుండలేక తుదకు
స్వార్ధ రహితుడొక పూజ్యుని సతి తన - జతకు దొరకగానె
తీర్ధయాత్రకై బయలుదేరి ఆ - దేవి యన్నపూర్ణ
అకలంకుండగు నా సర్వేశ్వరు-నాత్మ తలచుకొనుచు
సకల తీర్ధముల గ్రుంకుచు సముద్ర - స్నానమునకువెడలె
సూర్యగ్రహణంబగుట చేత కడు - సుదినము ఆ నాడు
సూర్యుడు పగలే చాటునకేగెను - చుక్కలు మొలచినవి.
క్రమ్మిన చీకటిలో నాయమ్మను - కపాల భైరవుడు
కిమ్మన కుండా ముంచి జలధిలో - సొమ్మసిలగచేసి
గైకొని చని తన బిలమున కామెను - ఖైదుచేసినాడు
ఆ కరుణామయి జీవితమిక నే - మౌనో చెప్పలేము

వ॥ ఈ వార్త శివయోగికీ, పున్నడికీ తెలిసింది. వారు కాలభైరవుడి నివాసం ఎక్కడో తెలుసుకోవడానికి బయలుదేరారు. ఈ దుర్గమారణ్యాన్నంతా గాలిస్తున్నారు. విక్రముడి కిదేమీ తెలియదు.

తనకు బజారులో కనుపించిన రత్నాల వర్తకుడు విక్రముడని గుర్తించిన కుందవి అతని రాకకు ఎదురు చూచింది. కాని అతడు రాలేదు. ఆమె విచారంగా కూర్చుంది. అప్పుడామె చెలికత్తె ఉడికిలించుతూ-

కీర్తన : రావోయి రావోయి
రతనాల వర్తకుడ
వెలలేని రతనమురా
విడచి వెళిపోవకురా ॥రావోయి॥
ఎనలేని అందాల
ఈ గులాబీ బాల
వలచి నిన్నా వేళ
పిలచింది రావేల ॥రావోయి॥
కలలోన కనుపించి
చెలిని దురహరియించి
బాధపెడుతున్నావు
వలపెరుంగవ నీవు ॥రావోయి॥

వ॥ అప్పుడు తన చెలికత్తెతో నన్నుఆట్టే విసికించక విక్రముణ్ణి కలుసుకునే మార్గం చెప్పమంది. ఇవ్వాళ మీ అన్న మహేంద్రవర్మగారు ఏదో పనిమీద ఉదయపురికి వెళుతున్నారని ఆ చెలికత్తె చెప్పింది. వెంటనే తన అన్నవద్దకు వెళ్లి ఆయన్ని ఒప్పించి తానుకూడా ఉదయపురికి బయలుదేరింది.

అక్కడ అడవిలో విక్రముడి పరిస్థితి ఎట్లా ఉంది.

పాట : నల్లనల్లని మబ్బులల్లరిగా వ్యాపించి
తళతళా తళ మెరసి ఫెళఫెళా గర్జించి
కుంభ వర్షంబల్లె కురిసింది
చిటికలో
ఘోరాటవిని ముంచివైచింది॥

జరజరా పెలియేళ్లు - పరుగులిడుతున్నాయి
గిరగిరా గిర సుళ్లు - తిరిగి పోతున్నాయి
అయిననూ పయనించుతున్నాడు
విక్రముడు భయమెరుంగనివాడు మొనగాడు.

వ॥ ఇంతలో విక్రముని గుర్రం ఒక కొండవాగు దగ్గరకు చేరుకుంది. ఆ వాగుకు దగ్గర్లోనే ప్రయాణీకుల సౌకర్యంకోసం పల్లవ రాజులు కట్టించిన మండపం ఒకటుంది. కాని వి కముడటు చూడలేదు. గుర్రాన్ని ముందుకు నడిపాడు. వాగుమధ్యకు వెళ్లేసరికి గుర్రం ఈతను పడింది.తానింకా అట్లాగే కూర్చుంటే గుర్రానికేకాదు, తనకూ ప్రమాదమే. వెంటనే విక్రముడు వాగులోకిదూకి ఈదడానికి పూనుకున్నాడు. వాగు నురుసులు కక్కుతూ పరిగెత్తుతూవుంది. సుడిగుండాలతన్ని ఒక్కసారి ముందుకు సాగనివ్వడంలేదు. పాపం అతడు యీది యీది అలసి పోయాడు. ఇక మునిగి పోవడమే తరువాయి.

బాల్యంలో యీతనేర్చుకుంటూ ఇట్లాగే యేటిలో మునిగి పోయాడు. అప్పుడు తనను కాపాడింది పున్నడు. పున్నడు జ్ఞాపకానికి రాగానే మునిగి పోతున్న విక్రముడు—

పున్నా పున్నా ఎక్కడ నుంటివి - పున్నాయని యరచె
ఉన్నా డతడా మండపంబులో - విన్నాడీ యరపు
పరుగున జని యా వ్యక్తిని యుక్తిగ - పైకి లాగినాడు
గురుతు పట్టి విక్రముని ప్రభోయని - గుండెకు హత్తుకొని
కొండవాగులో - దిగితివ యిపుడు - తండ్రీ నీ వనుచు
మండపంబునకు జేర్చి యచ్చట - పరుండ బెట్టినాడు.

వ॥ తరువాత కొంతసేపటికి విక్రముడు కళ్లు తెరచి పున్నణ్ణి గుర్తించాడు. అన్నపూర్ణ వృత్తాంతము పున్నడు చెప్పగావిని అతడు విలపించాడు. అప్పటికి విక్రమునికి తీవ్రమైన జ్వరం వచ్చింది. స్పృహ లేకుండ పడి వున్నాడు. పున్నడు కంగారుపడి ప్రక్కనున్న గ్రామానికి వైద్యుడి కోసం పరుగెత్తాడు.

ఉదయపుటికి బయలుదేరివెళుతున్న కుందవి, మహేంద్రులప్పటికి, విక్రముడు జ్వరపీడుతుడై పడియున్న మహేంద్రమండపంవద్దకు చేరు

కున్నారు. మండపంలోనుంచి అమ్మా అమ్మా అను మూలుగు వినిపించింది. కుందవి పల్లకి దిగి లోనికివెళ్ళి రత్నాలవర్తకుణ్ణి చూచింది. ఆమె ఆనందానికి మేరలేదు. కాని అతడు స్పృహలేకుండ పడివున్నాడు. ఆమె తనఅన్నకు నచ్చచెప్పి అతన్నికూడ తమతో ఉదయపురికి తీసుకువెళ్ళింది.

చాటునఉండి పున్నడిదంతాచూస్తూనేఉన్నాడు. కుందవి విక్రముణ్ణి ప్రేమించినదని పున్నడికీ తెలుసు. ఒకప్పుడీ విషయం శివయోగి తనతో చెప్పాడు. కనుక విక్రముడే మాటాడనే భయం యిప్పుడతనికి లేదు.

పున్నడీ మహేంద్రమండపంలో మకాం పెట్టి పాలభైరవుడికోసం వెదుతుతున్నాడు. నానా అవస్తలుపడి వాడి ఉనికి తెలుసుకోగలిగాడు. వెంటనే పున్నడు శిల్పిగృహానికి వెళ్ళి అక్కడ శివయోగిని కలుసుకున్నాడు. సర్వవిషయాలా మూలాగ్రంగా ఆయనకు చెప్పాడు. వెంటనే వారిద్దరూ కపాల భైరవుడి గుహకు బయలుదేరారు.

వారు గుర్రములపై చని చనియొక - ప్రదేశమును జేరి
వారువముల నట వదలి పొదలలో - దూరి దూరి వెళ్ళి
చుక్కల జూచెడి ఒక పెను గొండను - ఎక్కి యెక్కి తుదకు
అక్కటిలునకు నివాసమైన గుహ - ప్రక్కకు చేరారు.

వ॥ అప్పుడు శివయోగి పున్నడితో—

శివ : పున్నా ! ఇదేగా కపాల భైరవుడి గుహ ?

పున్న : అవును స్వామీ.

శివ : సరే. నీవు వెంటనే ఉదయగిరికి వెళ్ళి విక్రముణ్ణి కాపాడు. నేను వీడి సంగతి చూస్తాను.

పున్న : మిమ్మల్ని ఇక్కడ ఒంటరిగా వదలి ఎట్లా వెళ్ళను ?

శివ : ఫరవాలేదు. నన్ను గురించి భయపడకు. మారప్ప భూతికీ, కపాల భైరవుడికీ సంబంధంఉన్నదని నాకు తెలిసింది. మారప్ప మనవిక్రముణ్ణి భైరవికి బలి యిప్పించి తానేదో బావుకొవాలని చూస్తున్నాడు. కనుక నీవు వెళ్లి విక్రముణ్ణి అక్కడనుండి తప్పించి మహాబలిపురం ప్రక్కనున్న మండపానికి తీసుకురా. వెళ్లుపున్నా.

పున్న : చిత్తము స్వామీ. !

వ॥ ఇక్కడ పున్నడు ఉదయగిరికి బయలు దేరాడు. అక్కడ

విక్రముడికి రాజవైద్యులు మందు లిచ్చారు. కుందవియే స్వయంగా అత
నికి ఉపచారాలు చేస్తూవుంది. జ్వరం తగ్గి అతడు క్రమంగా కోలు
కున్నాడు. ఆ ప్రేమీ ప్రేమకు లెట్లా వున్నారు :-

ఒకరి మనస్సులు ఒకరు తెలుసుకొని ॥తందానా తందాన తందన॥
మనసులలో గల మమకారాలను „ „ „
కప్పిపుచ్చకా విప్పిచెప్పుకొని „ „ „
ప్రేమజీవులతి వినోదంబుగ „ „ „
ముచ్చటలాడుచునున్న తరుణమున – వచ్చిన పున్నండు
ముప్పుతెచ్చు మారప్ప కుట్రలను తందానా తందాన తందన
విక్రమునకు వినిపించి వివరముగ „ „ „
అపాయమును కడు–ఉపాయంబుగా „ „ „
దాటుమార్గమును సూటిగ జెప్పి „ „ „
కడురయమున విక్రమునితోడు కొని – కదలె నచటినుండి
తమకొరకై తగు – స్థలమున నుంచినతందానా తందాన తందన
గుర్రాలపైనా యిరువురు కదలీ „ „ „
పెదదారిని కారడవిని దాటీ „ „ „
మహాబలిపురం మార్గముబట్టీ „ „ „
శివయోగులు జెప్పిన మండపమును – జేరినారువారు

వ॥ ఆ మండపంలోవున్న భటులలో ఒకడు పున్నణ్ణి గుర్తించి
లోపల అన్నపూర్ణాదేవి ఉన్నదని చెప్పాడు. వెంటనే విక్రముడూ,
పున్నడూ గుర్రాల మీదనుంచి దూకి—

అమ్మాయని యరచుచు లోనికిజని – యచట కూరుచున్న
అమ్మ పాదములపైన వ్రాలి వా – రడలి యేడ్చినారు

వ॥ అన్నపూర్ణ వారిద్దరను లేవనెత్తి విక్రముని తల నిమురుచు
వుంది. అప్పుడు విక్రముడంటాడూ–

నిన్నీ స్థితిలో చూచుటకా నను – గన్నది ఓ తల్లీ
ఎన్ని కష్టములు పడితివమ్మనీ – విన్ని నాళ్ళనుండి.
వీరాగ్రణి నా తండ్రి కోర్కె ఈ – తీరుగ తీరింద
వీరపత్నివై కంటి వెందుకీ – భీరువునోయమ్మా !
అని విలపించెడు తనయునితో నా – యమ్మ పలికె నిటుల

తనయా ! వినుమిది విధి విధానమురా - తప్పదు పోనిమ్ము

వ॥ కాపాలికు లెవ్వరూ లేని తరుణంలో శివయోగులు ఆ గుహ లోకి ప్రవేశించి నన్ను కాపాడి ఇక్కడకు తీసుకొచ్చారు. తిరిగి వెంటనే కాలభైరవుని బంధించటానికి ఆ గుహకు ఒంటరిగా వెళ్ళారు. ఆయనకేం ప్రమాదం సంభవిస్తుందో అని భయపడుతున్నాను అంది.

విక్రముడు, పున్నడు శివయోగికి తోడ్పడడానికి బయలుదేరారు. అక్కడే బంధింప బడియున్న మరుగుజ్జు తనను తీసుకెళ్ళితే తొందరగా అక్కడ చేరే మార్గం చూపుతానన్నాడు. సరేనని వాడినికూడ తమతో తీసుకెళ్ళారు.

ముగ్గురు ఆ గుహలో ప్రవేశించారు. అక్కడ శివయోగిని వాళ్ళు బంధించారు. విక్రముడు అక్కడకువెళ్లి ఆయన బంధనాలను తెగగొట్ట టానికి ముందుకు దూకాడు. కపాలభైరవుడాతని అడ్డగించి అంటాడూ—

వచ్చినావ శివయోగి రక్షణకు - పిచ్చివాడ నీవు.
ఖచ్చితంబుగా చంపునితని ఈ - కాలభైరవుండు.

విక్ర : కరవాలము నా చేతనుండగా - దురితాత్మ వినర
పరి మార్చుట నీతరముగాదు - ఈ పరమపూజ్యునోరి

భైర : తెలిసినచో ఇతదెవ్వరో నీవీ - తీరుగ పలుకవుర
ఖలుడీ ద్రోహిని తప్పక నీవే - ఖండించెదవంతె

వ॥ తాను చేసిన పాడుపనికి పశ్చాత్తాపపడుతూ అక్కడకు వచ్చి ఈ సంభాషణ విన్న మారప్ప భూపతి

వారుకాదురా ద్రోహివి నీవే - క్రూరాత్మయనుచు
వీరావేశంబున తన బాకును - విసరెను మారప్ప
డొక్కను బడి పిడిబాకు భైరవుం - డక్కడె పడిచచ్చె
నిక్కము పరులకు కీడు తలంచెడి - నీచుల గతి యింతే.

వ॥ వెంటనే మరగుజ్జువాడు మారప్ప భూపతిపైకి దూకి తన బాకును ఆయన గుండెల్లో గుచ్చాడు. కుట్రదారులిద్దరూ చనిపోయారు.

తదుపరి బంధవిముక్తుడైన శివయోగి నరసింహవర్మయని తెలిపోయింది. అంతా ఉదయపురికి వెళ్లారు. అక్కడ విక్రమునకు, కుందవికి మహా వైభవంగా వివాహం జరిగింది. దానితో చోళులకు, పల్లవులకు మధ్యనున్న వైషమ్యంకూడ అంతరించింది.

మా వెండితెర నవలలు

	రచన :	సంక్షిప్తీకరణ :	
* తోడికోడళ్లు	ఆత్రేయ	రామచంద్	0.37
పెద్దరికాలు	కొండేపూడి		0.37
* తలవంచనివీరుడు	శ్రీశ్రీ	పరుచూరి	0.50
* గౌతమబుద్ధ	ఖన్నా	పిచ్చేశ్వరరావు	0.50
* మాంగల్యబలం	ఆత్రేయ	మధుమూర్తి	0.50
జయభేరి	,,	,,	0.60
ఇల్లరికం	సదాశివబ్రహ్మం	పిచ్చేశ్వరరావు	0.60
కృష్ణలీలలు	,,	,,	0.60
నమ్మినబంటు	సుంకర	,,	0.60
వెలుగునీడలు	ఆత్రేయ	యం. వెంకటరమణ	0.75

* కాపీలు అయిపోయినవి.